'స్వాతి' మాసపత్రిక - ఫిబ్రవరి, 2004

కథా నిలయం
శ్రీకాకుళం

# ఒంటరితనం

సమయం సాయంత్రం. వాతావరణం పొడిగా వుంది. ధూళిగా, దుమ్ముగానూ ఉంది. హాస్పిటల్‌కి అభిముఖంగా భానుమూర్తి నిలబడి వున్నాడు. అతనికి నీరసంగా ఉంది. నిస్సత్తువగా ఉంది. చచ్చిపోవాలనీ ఉంది.

ఫైవ్‌స్టార్ హోటల్‌ని మరిపిస్తున్న నక్షత్ర హాస్పిటల్ నుంచి అరగంట క్రితమే బయటకు వచ్చేడు భానుమూర్తి. అతడు రోగి కాదు. అతని మిత్రుడు రామయ్య రోగి. రామయ్యని చూసి రావాలని ఏ రోజు కారోజు అనుకుంటూనే వున్నాడు. చివరికి ఈ రోజు తీరికయింది. చూసి వస్తున్నాడు.

భానుమూర్తికి తీరిక లేకపోవడం ఏమిటి?

అతడు గవర్నమెంటు ఉద్యోగం నుంచి రిటైరయి రెండేళ్ళు అయింది. పనీ లేదు, పాటూ లేదు. ఇల్లు వున్నా పెళ్ళాం లేదు. కొడుకు రాడు. తీరిక లేనంత పని ఏం చేస్తున్నాడో అతనికే తెలీదు.

భానుమూర్తికి ఈ స్థలం కొత్త కాదు. గతం గుర్తుకొచ్చి ఏకంగా ముప్ఫైయ్యేళ్ళ వెనక్కి వెళ్ళేడు.

అప్పుడు భానుమూర్తి ముదుసలి కాదు. చెలరేగుతున్న మిట్టమధ్యాహ్నపు మార్తాండుడు.

ఆ రోజుల్లో అక్కడ నక్షత్ర హాస్పిటలే కాదు. చెత్త కుప్ప కూడా లేదు - దూరంగా స్మశానం తప్ప. పిల్లలు ఆడుకునే బహిరంగ స్థలం.

అక్కడ, అప్పుడు భానుమూర్తి ఒక సాయంత్రం ప్రజా సమస్యలపై వీరావేశంతో వీధి నాటకం ప్రదర్శించేడు. ఆ నాటక బృందంలో అతని భార్య సరోజ కూడా ఉంది. ఆ నాటకం చూసిన జనం బ్రహ్మాండంగా స్పందించారు. ఆ నాటకాన్ని నగరంలో ప్రతి సందులో వందకి పైగా ప్రదర్శనలు ఇచ్చేరు. భానుమూర్తి వీధి పోటీల్లో పాల్గొనే పరిషత్తు నాటకాల వాడు కాదు. అతడు నాటక రంగాన్ని భార్య సరోజతో సమంగా ప్రేమించిన వాడు. ఒక ప్రయోజనం ఆశించిన వాడు. ప్రయోజనం అంటే కాళ్ళు స్టేజీపై ఉంచి కళ్ళు సినీరంగంపై నిలపడం కాదు. ఒక సామాజికపరమైన ప్రయోజనం.

నాటక రంగంలో నూతనత్వం, ప్రయోగం ఎక్కడ ఉందో భానుమూర్తి తప్పనిసరిగా అక్కడే ఉండేవాడు - సరోజతో సహా. భానుమూర్తిలో ఇప్పుడు అప్పటి ఉత్సాహం, ఆవేశం లేవు. ఓపిక లేదు. వయసు లేదు. తన ప్రియనెచ్చెలి సరోజ లేదు. నాటకాల జోలికి అసలు వెళ్ళడం లేదు.

అయినా ఈ తెలుగు ప్రపంచంలో నాటక రంగానికి వెలుగు ఎక్కడుంది? దిగులుతో బక్కచిక్కిపోయి చచ్చిపోయింది ఎప్పుడో!

నాటక రంగమే కాదు సరోజ కూడా చచ్చిపోయింది. భానుమూర్తికీ చచ్చిపోవాలని ఉంది. తన జీవిత అంకానికి ఇనుప తెర పడనుంది.

ఆసుపత్రిలో మృత్యువుకి అత్యంత సమీపంలో ఉన్నాడు మిత్రుడు రామయ్య. అతను చాలా అదృష్టవంతుడు. అయితే రామయ్యను బతికించుకోవడానికి అహోరాత్రులు కొడుకులు లక్షలు లక్షలు ఖర్చుపెడుతున్నారు. ఇది నిజంగా వింతే! కొడుకులకు తండ్రి ఎందుకు? లక్షలు కావాలి.

తనకీ కొడుకు ఉన్నాడు. ఎత్తులో ఉన్నాడు. కనీపెంచిన తల్లితండ్రులు కనిపించినంత ఎత్తులో డాలర్ల మధ్య మునిగితేలుతున్నాడు. డాలర్లు సెంటిమెంటుకి దూరం కాబోలు.

భానుమూర్తి ముందు ఆటో ఆగింది.

"ఎక్కడికి వెళ్ళాలి సార్?"

"స్వర్గానికి" అన్నాడు.

ఆటోవాడికి అతని మాటలు అర్థం కాలేదు. మరోసారి అడిగే లోపల ఆటోలో కూర్చున్నాడు భానుమూర్తి.

"త్వరగా పోనీయ్" అన్నాడు.

ఆటో కదిలింది. స్వర్గలోకాలకు దూసుకుపోతోంది యమా స్పీడ్‌తో. రోడ్డు రద్దీగా ఉంది. సాయంకాలం వెలుగు ఇంకా స్పష్టంగానే ఉంది. దుమ్ము, ధూళికి వాహనాలు వెదజల్లే కాలుష్యానికి రోడ్డు కిరువైపుల పచ్చదనం కోల్పోయిన చెట్లు, ఎవరో బురద జల్లినట్లు, మసకబారినట్లు కళావిహీనంగా ఉన్న భవనాల సముదాయం. భానుమూర్తికి చికాకుగా ఉంది. చచ్చిపోవాలని ఉంది. మొన్నమొన్నటి వరకూ తన జీవితం ఎలా ఉండేది? సుందర స్వప్నం. ఒకవైపు ఊపిరి సల్పనివ్వని సంసారంతో, మరోవైపు ఉద్యోగంతో, మధ్యలో నాటకాల పిచ్చితో రోజుకి ఇరవై నాలుగు గంటలు చాలనంత బిజీగా, స్పీడుగా, సుఖంగా, హాయిగా చల్‌మోహనరంగా అంటూ సాగిన జీవితం. సరోజ అతని బహిఃప్రాణం. ఆమె తన చెంత ఉంటే మరింకెవరూ అక్కర్లేదు. ఏమీ అక్కర్లేదు. తనని జీవితాంతం అంటిపెట్టుకుని ఉన్నట్టే భ్రమ కలిపించి ఒక్కసారిగా క్రూరంగా, కర్కశంగా అంతర్థానమైపోయింది. సరోజకిది తగునా!

సరోజ తన జీవితంలోకి ప్రవేశించిన రోజు నుంచి అందంగా, ఆకర్షణీయంగా, హుషారుగా మాత్రమే కాదు - ఎంతో ఆరోగ్యంగా కనిపించేది. రాత్రులు నాటక రిహార్సల్స్‌కి భానుమూర్తి బయటకు వెళితే తనతోబాటు ఆమె ఉండాల్సిందే! తర్వాత్తర్వాత వాళ్ళ ఇల్లే రిహార్సల్ రూమ్‌గా మారిపోయింది. నాటకం వేసినా, వేయకపోయినా రోజూ సాయంత్రం నాటక మిత్రులు అక్కడ చేరేవారు. ఎన్నో కబుర్లు, మరెన్నో చర్చలు - సమయం తెల్సేది కాదు. సరోజ గంటగంటకీ టీలు ఇస్తూ తనూ చర్చల్లో పాల్గొనేది. ఎవరైనా జోక్‌లు వేస్తే సెలయేరులా పకపకమని నవ్వేది. గళగళమని మాటాడుతూ కళకళలాడుతుండేది.

సరోజ ఏనాడూ ఒంట్లో బాగోలేదని బద్ధకించి ముసుగు తన్ని పడుకోలేదు. భానుమూర్తికి వంట తెల్సు. అయినప్పటికీ ఏ ఒక్కసారి తనకు వంట గదిలోకి ప్రవేశించే అవకాశం ఇవ్వలేదు.

తెల్లవారుజామున బెడ్‌కాఫీ నుంచి రాత్రి పడక వరకూ తనను సేదతీర్చే మహా ఇల్లాలు.

నాటక రంగం వాళ్ళ పెంపుడు బిడ్డ. కన్నబిడ్డ ఒక్కరు చాలనుకున్నారు. పుట్టిన మగబిడ్డకి 'చైతన్య' అని పేరు పెట్టారు. కొడుకుని నాటకాల్లో పడి నిర్లక్ష్యం చేయలేదు.సరోజ అల్లారు ముద్దుగా చూసుకునేది. పెద్దవాడు అవుతున్నా తనే అన్నం తినిపించాలి. తెరిచే పుస్తకం

పక్కన అమ్మే కూర్చోవాలి. తల్లి సహకారం, తండ్రి ప్రోత్సాహం లేకుంటే చైతన్య ఐఐటి చదువుకి చెన్నై వెళ్ళేవాడు కాదు. సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా అమెరికా వెళ్ళి ఉండేవాడు కాదు.

ఏ విషయంలో కూడా భర్తకీ, కొడుక్కీ లోటు చేయలేదు సరోజ. చైతన్య అమెరికా వెళ్ళిపోయేక, భానుమూర్తి ఇంకా చంటిపిల్లవాడిగా మారిపోయి సరోజ కొంగు పట్టుకు వేలాడేవాడు.

ఆ రోజు సరోజ ఎందుకోగానీ తెల్లగా తెల్లవారినా బెడ్‌కాఫీ ఇవ్వలేదు. భానుమూర్తి చప్పుడు చేయకుండా నెమ్మదిగా మంచం మీంచి లేచేడు.

హాయిగా నిద్రపోతోంది సరోజ.

అదృష్టం! తనకి మొదటిసారిగా వంటగదిలోకి ప్రవేశించే అవకాశం వచ్చింది. సరోజని సర్‌ప్రైజ్ చేద్దామని తను అయిదు నిముషాల్లో కాఫీ తయారుచేసి సరోజను లేపడాని కొచ్చేడు.

లేవలేదు సరోజ. ఎంత లేపినా లేవలేదు సరోజ. ఆ రోజు తను చేసిన కాఫీ తాగనూ లేదు. ఆ రోజు నుంచి తనకు కాఫీ ఇవ్వనూ లేదు. సరోజ నిద్దట్లోనే తనువు చాలించింది. గుండెపోటు అన్నారు.

సరోజ అదృష్టవంతురాలట! తను బాధ పడక, ఏ ఒక్కరినీ బాధ పెట్టక నిద్దట్లోనే నవ్వుతూ వెళ్ళిపోవడం గొప్ప చావట! అలాంటి చావు ఎంతమందికొస్తుందని ఆమెను మెచ్చుకునేవారే?

అంతే తప్పా తనని దిక్కుమాలినవాడిగా చేసి పోయిందని సరోజను ఎందుకు నిందించరు? అసలు సరోజకి చావు ఎందుకు రావాలి? తనని వదలి ఎందుకు వెళ్ళాలి? భానుమూర్తిని వెన్నెల వెలుగులా మరపించి సుందర స్వప్నంలా అదృశ్యమయింది సరోజ. సరోజ లేని లోటును కొంతవరకూ భర్తీ చేయగల అవకాశం ఒక్కడికి మాత్రమే ఉంది. అతడు చైతన్య. భానుమూర్తి కొడుకు.

కొడుకు చాలా దూరంలో – తనకు అందనంత దూరంలో – ఉన్నాడు. అసలు లేడు అనుకుంటేనే మంచిది. సరోజ కొడుకుని మర్చిపోవడానికి గుండెను బండరాయిగా చేసుకుంది.

చైతన్య అమెరికాలో ఉద్యోగంలో చేరేవరకే వాళ్ళ కొడుకు. అక్కడే చైతన్య ఒక గుజరాతీ అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. పెళ్ళి చేసుకున్న విషయం తల్లిదండ్రులకు చెప్పాలనే జ్ఞానం రెండేళ్ళకి గుర్తుకు వచ్చింది. అది కూడా 'ఒక మంచి సంబంధం చూశాం. పెళ్ళి చేసుకుపోరా బాబూ' అంటే "మీకు ఆ శ్రమ అక్కర్లేదు. నాకు ఎప్పుడో పెళ్ళి అయింది. అంతే కాదు ఒక బిడ్డకి తండ్రినీ అయ్యాను" – పెద్ద విషయం కానట్లు చాలా తేలిగ్గా చెప్పేడు చైతన్య.

భానుమూర్తి, సరోజ హతాశులయ్యేరు. ఆ షాక్ నుంచి బయటపడడం చాలా కష్టమయింది.

అమెరికా వెళ్ళిన తొలి రోజుల్లో వారానికి రెండు, మూడుసార్లు ఇంటికి ఫోన్ చేసిన

చైతన్య రెండు, మూడు నెలలకొకసారి ఫోన్ చేసే స్థాయికి ఎదిగేడు. ఆ రోజు చైతన్య పుట్టినరోజు. చైతన్య నుంచి ఫోన్ లేదు. సరోజ భరించలేక భానుమూర్తి చేత ఫోన్ చేయించింది. పుట్టిన రోజు సందర్భంగా తల్లి ఫోన్‌లో ఆప్యాయంగా మాట్లాడబోతుంటే-

"హాయ్! మమ్మీ. అయామ్ వెరీ బిజీ. ఎగైన్ ఐ విల్ కాంటాక్ట్ యూ! బై" - ఫోన్ డిస్‌కనెక్ట్ అయింది. చైతన్య మళ్ళీ ఫోన్ చేస్తే ఒట్టు. ఎప్పుడు చూసినా బిజీగా ఉన్నాను అంటాడు చైతన్య.

తల్లి ఏడిస్తే 'నో సెంటిమెంట్! ఏడుపు అంటే నాకు అసహ్యం. అంచేత ఏడ్వకు. ఏదైనా మాటాడు వింటాను' అనేవాడు. తర్వాత సరోజ ఏడ్వటం మానేసింది. అంతేకాదు ఎప్పుడైనా గాలి మళ్ళి చైతన్య ఫోన్ చేస్తే 'అయామ్ వెరీ బిజీ!! డోంట్ డిస్టర్బ్ మి' అని చటుక్కున ఫోన్ పెట్టేసేది. 'వీడు ఏమిటండీ ఇలా తయారయ్యేడు' అని భానుమూర్తి ఎదుట కూడా ఏడ్వటం మానేసింది సరోజ.

కొడుకు తలంపు వాళ్ళను వెంటాడకుండా, దుఃఖంతో కుమిలిపోకుండా నిద్రపట్టని రాత్రులు మంచంపై నుంచి లేచి కొత్త ముఖాలతో తమ కిష్టమైన నాటకాలలో కొన్ని సీన్‌లు ఉద్వేగభరితంగా నటించే వారు భార్యాభర్తలు ఇద్దరూ.

ఇద్దరికీ గురజాడ కన్యాశుల్కంలో ప్రతి డైలాగు కొట్టిన పిండి. అంచేత ఒకసారి బుచ్చెమ్మ, గిరీశంలా నటించేవారు. మరోసారి మధురవాణి, రామప్పంతుల్లా అభినయించే వారు. అయితే ఇదంతా బెడ్ రూమ్‌లోనే! వరండాలో వేస్తే వీళ్లిద్దర్నీ పిచ్చివాళ్ళు అనుకుంటారు. ఆ విధంగా తమకు నచ్చిన నాటకాల్లో కొన్ని సీన్లు నటించి తమని తాము మరచిపోయి, అలసిపోయి, ఏ అర్థరాత్రో ఇద్దరూ ఒక్కటైపోయి వాటేసుకుని నిద్రపోయేవారు.

సరోజది ఒక అసాధారణమయిన వ్యక్తిత్వం. ఆమె ఆత్మాభిమానం, మొండితనం, ఏ విషయంలోనైనా ఆమె నిర్దుష్ట భావ పరిపక్వత భానుమూర్తిని ఎంతగానో అబ్బురపరిచేవి. సరోజ పైకి నిబ్బరంగా కనిపించినా గుండెపోటుతో కాక గుండె కోతతో కుమిలి కుమిలి చనిపోలేదు కదా!

చైతన్య తల్లి ముఖం చివరిసారిగా చూడటానికైనా వస్తాడనుకున్నారు. చైతన్యకి అంతటి అదృష్టమా! సెలవు దొరకలేదంటూ పది రోజులు పోయాక పెద్ద ఖర్మకి వచ్చాడు. ఒక్కడే వచ్చేడు.

చైతన్య రెండే రెండు రోజులుండి తండ్రిని కౌగలించుకొని, రెండు కన్నీటి బొట్లు రాల్చి విమానం ఎక్కేశాడు. వీలుచూసుకొని తన దగ్గరికి అమెరికా వచ్చేయమని వెళుతూ అన్నాడు.

'ఒరే బాబూ! నేను రాను. నీవూ రావొద్దు. రేపు నేను పోయేక నన్ను పున్నామ నరకం నుంచి రక్షించేయడానికి, నా అంత్యక్రియలు జరపడానికి నీవు ఇక్కడికి రావొద్దు. అమెరికాలో నీవు ఎప్పుడూ బిజీబిజీగానే ఉండు' అని అనడానికి భానుమూర్తి నోరు రాలేదు. కన్నీళ్ళు మాత్రం వచ్చేయి.

సరోజ తనని వదిలి వెళ్ళిపోయి పది నెలలు అయిందంటే ఆశ్చర్యంగా ఉంది. సరోజ లేకుండా క్షణమైనా బతకలేని తను పది నెలలు ఎలా బతకగలిగేడు? ఏమైనా రోజులు తనకు దగ్గరపడ్డాయనే విషయం ఏదో అస్పష్టంగా అనిపిస్తోంది.

తను ఈ లోకం వదిలి వెళ్ళిపోయేముందు చేయవలసిన ఒక ముఖ్యమైన పని ఉంది. దానికి అన్ని ఏర్పాట్లు జరిగినాయి. ఉత్తమ నాటక రచనకి ప్రతి ఏడాది సరోజ పేరున ఒక అవార్డు.

తన వద్ద అయిదు లక్షలు ఉన్నాయి. రాచకొండ నాటక మండలి అనే సంస్థ ఉంది. దాని నిర్వాహకుడు సుబ్బారావు తన ప్రియమిత్రుడు. సుబ్బారావు సలహాతో భానుమూర్తి ఓ రిజిష్టర్డ్ వీలునామా రాయించేడు. దాని ప్రకారం భానుమూర్తి తదనంతరం అతని డబ్బు రాచకొండ నాటక మండలి ట్రస్టు ద్వారా ప్రతి ఏడాది సరోజ పేరున ఉత్తమ నాటక రచనకి అవార్డు ఇవ్వబడుతుంది.

ఈ లోకంలో తన పని అయిపోయింది. ఇక తృప్తిగా సరోజ చెంతకి వెళ్ళిపోవచ్చు.

ఆటోలో పయనిస్తున్న భానుమూర్తి జేబులో ఆ వీలునామా ఉంది. ఆటోని మిగతా వాహనాలు ఓవర్‌టేక్ చేసుకుంటూ పోతున్నాయి. ఆటో డ్రైవర్‌కి ఒళ్ళు మండి స్పీడ్ రైజ్ చేశాడు.

కాలం మన కోసం ఆగదు అనే స్పృహతో వాహనాలు దూసుకుపోతున్నాయి. కాలంతో సమంగా పరిగెట్టడం కూడా సరిపోదు. మనమే ముందుకు పరిగెట్టి కాలం పిలక పట్టుకోవాలి అన్న లక్ష్యంతో వాహనాలు ఉరుకులు పరుగులు తీస్తున్నట్టు కన్పిస్తున్నాయి. ఆ పరుగులాటలో రిస్క్ ఉంది. మరి రోడ్డుపై అదిగో ఆ మదుం వద్ద గుంపులు గుంపులుగా జనం. ఖచ్చితంగా అది యాక్సిడెంటే.

ఆ యాక్సిడెంట్‌లో కనీసం ఒక శాల్తీ లేచిపోయి వుంటుందని భానుమూర్తికి బలంగా తోచింది. తనలో ఔత్సుక్యం నిరాశాజనకం కాగూడదు.

ఏమిటీ! తను రాక్షసంగా కనీసం ఒక చావునైనా ఆశిస్తున్నాడా! అలా కాకుండా ఏ ఒక్కరికీ చిన్న గాయం లేకుండా అందరూ ప్రమాదం నుంచి బతికి బయటపడాలని కోరుకోవచ్చుకదా!

మరి ఎందుకలా తను స్పందించాడు?

మనకి ఎంతో ద్రోహం చేసిన పరమ శత్రువు కూడా నికృష్టంగా చావకూడదని కోరుకునే సంస్కారం మన రక్తంలో ఉందనుకుంటాం. అటువంటిది ఒక ఆగంతకుడు, ఒక అపరిచితుడు దారుణంగా, క్రూరంగా చావాలనుకోవడం, చస్తే చూడాలనుకోవడం ఎంత అమానుషం!

తనలో అకారణంగా ఎందుకు హింసాత్మకత ద్యోతకమవుతోంది? లేదు లేదు. తను రాక్షసుడు కాడు. ఖచ్చితంగా అది మానవ స్పందన. అవును - సహజ స్పందన. కాకుంటే భయానకం నుంచి పొందే భయాన్ని ఎందుకు ఆనందిస్తాం!

తను చిన్నప్పుడు అందరిలాగే బీస్ సాల్ బాద్, కొబ్రా లాంటి సినిమాలు చూసిందే చూసి ఆ భయాన్ని ఎంతో ఆనందించేడు. ఎంచేత?

బీభత్సం, భయానకం, పైశాచికం, విధ్వంసం, మారణహోమం... ఆ షాకింగ్ దృశ్యాలు చూసినా, చదివినా ఎందుకు ఇంట్రెస్టింగ్‌గా ఉంటాయి? ఏ రూపంలోనైనా సరే పరమ జుగుప్సాకరమైన వయొలెన్స్‌ని చూసి ఎందుకు తరిస్తాం?

స్పాంటేనియస్‌గా మనలో కలిగే ఫీలింగ్‌ని ఆనందించడం నిజం. తర్వాత అలా యోచించడం తప్పు అనే వివేచన, సంస్కారం వేరు.

ఇంకా ఏదో గందరగోళం. సరోజ గనుక బతికి ఉన్నట్లయితే ఈ సబ్జెక్ట్‌పై రాత్రంతా ఆమెతో చర్చించి ఉండేవాడు. ఆమె తనని సపోర్టు చేసేదా? 'ట్రాష్' కింద తేలిగ్గా కొట్టిపారేసేదా!

మదుం దగ్గర ఆటో ఆగింది.

యాక్సిడెంట్ గురించి క్యూరియస్‌గా ఎంక్వయిరీ... భానుమూర్తి ఆశించినట్లుగానే లేక ఊహించినట్లుగానే ఒక వ్యక్తి చనిపోయేడు. అయితే రోడ్డు పైన కాదు. మదుం కింద రైలు పట్టాలపై ఒక యువకుడు ఆత్మహత్య చేసున్నాడు.

భానుమూర్తి మనసు చివుక్కుమంది.

ఎంత బలీయమైన కారణం లేకుంటే ఆత్మహత్య చేసుకుంటాడు? ఆత్మహత్య పిరికి చేష్టగా తీసిపారేయడం కరెక్టు కాదు. దానికెంత తెగువ, ధైర్యం కావాలి. ఆ తెగువ, ఆ ధైర్యం దైవం తనకు ప్రసాదిస్తే ఈ క్షణమే రైలు పట్టాలపై తన తలను రైలుకి బలి ఇచ్చి విముక్తి పొందగలడు.

జీవిత ఆపేక్షకి, మృత్యువు కోరలకీ సంబంధం, సమన్వయం అసలు ఏమయినా ఉన్నదా? ఎవరి చావు వాళ్లకి ఆనందం కావాలి.

మృత్యువు కౌగిట్లో ఉక్కిరిబిక్కిరి అవుతున్న రామయ్య గుర్తుకొచ్చేడు భానుమూర్తికి.

రామయ్యని అతని కొడుకులు ఆస్పత్రిలో జాయిన్ చేయకుండా ఉండాల్సింది. అనవసరంగా లక్షలు ఖర్చు చేస్తున్నారు. డాక్టర్లు ఎంత గొప్పవారయినా రామయ్యని రక్షించలేరు. మహా అయితే ఆయన చావుని కొన్ని రోజులు ముందుకి జరపగలరు. రామయ్య ఎందుకో ఈ రాత్రి కన్నుమూస్తాడని, ఆ విషాద వార్త ఉదయం ఎవరో తన చెవిలో వేస్తారని భానుమూర్తికి అనిపించింది.

రామయ్యకి అరవై ఎనిమిది సంవత్సరాలు. కిరాణా దుకాణం. మంచి రాబడి. బాగానే సంపాదించేడు. ఇద్దరు కొడుకులు. పెద్ద కొడుకు తండ్రితో బాటు కొట్టులో కూర్చుంటాడు. రెండవ వాడు ఏదో కంపెనీలో గుమస్తా ఉద్యోగం చేస్తున్నాడు. వాడు కూడా డ్యూటీ నుంచి వచ్చేక సాయంత్రం కొట్లో కూర్చుంటాడు. కొట్లోవి సప్లయి చేయడానికి వాళ్ళ ఆరు చేతులూ చాలవు. అంత రద్దీ.

కొడుకులు ఇద్దరికీ పెళ్ళిళ్ళు అయ్యేయి. తండ్రీ, కొడుకులు కలిసే ఉంటారు. ఒక రోజు రామయ్యకి విపరీతంగా తలనొప్పి వచ్చి నేలపై అమాంతంగా కూలబడిపోయేడు. అతనికి బీపీ, షుగరూ ఉన్నాయి. మందులు సరిగా వాడడు కాబోలు.

మనం చికిత్సకి ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్ళడం మర్చిపోవడం అదొక గొప్పయిపోయింది. 'ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళకపోవడానికి చెప్పే కారణాలు చాలా ఉన్నాయి. దయచేసి వాటి గురించి మాటాడొద్దు. ఏం పేదవాళ్ళు, కార్మికులు వెళ్ళడం లేదా? వైద్యం చేయించుకోవడం లేదా? ఇక్కడ అసలు విషయం ఏమిటంటే మన చేతుల్లో డబ్బు లాడుతున్నప్పుడు మనకి గవర్నమెంటు ఆస్పత్రి వాసన ఎలా పడుతుంది?' - అని అంటాడు భానుమూర్తి.

రామయ్యని అయిదు నక్షత్రాల హోటల్‌లా ఉన్న నక్షత్ర కార్పొరేట్ హాస్పిటల్లో జాయిన్ చేశారు. ఇరవై రోజులు పైగా అవ్వస్తోంది. రామయ్య పరిస్థితిలో మార్పు లేదు. మరోవైపు అతని కొడుకులు డబ్బుని మంచి నీళ్ళ ప్రాయంగా ఖర్చు పెడుతున్నారు.

ప్రతి రోజు నలుగురైదుగురు స్పెషలిస్టు డాక్టర్లు ఎందుకు వస్తున్నారో ఏమిటో తెలియదు. ఏవో మందులు, టెస్టులు ఎంత ఖరీదువైనా సరే సర్రున బరికేసి వెళిపోతున్నారు. అలా బరికి వెళ్ళినందుకుగాను ప్రతి విజిట్‌కి మూడు వందలు రోగి ముక్కు పిండి వసూలు చేయబడును. డబ్బు ఖర్చే తప్పా ఆ చేస్తున్న వైద్యం మాత్రం ఏమిటో తెలీదు.

ఇంత డబ్బు కట్టండి అనడంతో పరుగున వెళ్ళి క్యాష్ కౌంటర్లో కట్టేస్తున్నారు పాపం రామయ్య కొడుకులు. డబ్బు కట్టేటప్పుడు ఎందుకు, ఏమిటి అని అడగడానికి సంకోచం. కట్టమనగానే చేతిలో డబ్బు లేకున్నా ఎక్కడ నుంచైనా తీసుకురావడానికి చెమటలు కక్కుతూ పరిగెట్టడం - ఇరవై రోజుల్లో లక్ష రూపాయలకి పైగా ఖర్చు పెట్టేరు.

ఇప్పుడు ఆపరేషన్ చేయడానికి ఎనభై వేలు కట్టమంటున్నారట! తను సమయానికి వచ్చేడు. పిల్లలు ఇద్దరికీ బ్రెయిన్ వాష్ చేయాలి.

రామయ్యని మరోసారి చూసి, ఆరోగ్య స్థితి విచారించి, అతని కొడుకులిద్దర్నీ సీరియస్‌గా హాస్పిటల్ బయటకు తీసుకువెళ్ళేడు భానుమూర్తి.

"నేను మీ తండ్రిలాంటి వాడిని. ఒక మాట చెబుతాను వింటారా?" అన్నాడు.

అన్నదమ్ములిద్దరూ తండ్రి కోసం ఎవరేమి చెప్పినా వినే స్థితిలో ఉన్నారు. చెప్పినవి చేస్తున్నారు. గుడికెళ్ళి రామయ్య కోడళ్ళు పూజలు చేస్తున్నారు. భానుమూర్తి చూస్తుండగానే గుడి నుంచి తెచ్చిన విభూది మామయ్య నుదుటన పెట్టారు.

"రామయ్యకి మీలాంటి ఉత్తమ కొడుకులుండడం అతని అదృష్టం. తండ్రికి గెంజి పోయని కొడుకులున్న ఈ రోజుల్లో మీరు తండ్రి కోసం లక్షలు గుమ్మరిస్తున్నారు. మిమ్మల్ని చూస్తుంటే నా కొడుకుని తల్చుకోడానికి సిగ్గేస్తోంది."

"ఎన్ని లక్షలు ఖర్చయినా ఫర్వాలేదు సార్! అయినా ఆ డబ్బు అంతా మా నాన్నగారు సంపాదించిందే గదా. ఆయన డబ్బు ఆయనకే ఖర్చు పెడుతున్నాం" అన్నారా అన్నదమ్ములు.

"అక్కడే పొరపడ్డారు. మీ నాన్న సంపాదించింది ఎవరి కోసం - మీ కోసం. తన పిల్లలు పది కాలాలు పచ్చగా ఉండాలని కదా! మీరు డబ్బుని డాక్టర్లు ఎంత కట్టమంటే అంత కట్టేస్తున్నారు. పదా పరకా! లక్షలు! మీ నాన్న ఎన్నాళ్ళు కష్టపడితే వచ్చిన డబ్బు అది! మీ నాన్నకి నోటి మాట లేదుగాని లేకుంటే మీరు పెడుతున్న ఖర్చుకి ఒప్పుకునేవాడు కాదు. తనను ఇంటికి తీసుకుపొమ్మనేవాడు."

"మీరేం చెబుతున్నారో మాకు అర్థం కావడం లేదు. ఇంతకీ మమ్మల్ని ఏం చేయమంటారు?" - రామయ్య చిన్నకొడుకు చిరాకు.

"బాధాకరంగా ఉన్నా ఒక విషయం స్పష్టంగా చెప్పదలచుకున్నానయ్యా - మీపై నాకు అంత చొరవ, చనువూ ఉన్నాయి. నేను చెప్పేదేమిటంటే నేనూ, మీ నాన్న ముసలివాళ్ళం. బతుకు పుస్తకంలో చిరిగి పోతున్న చివరి పేజీలం మేము. కాటికి కాళ్ళు చాచుక్కూర్చున్నాం. మీరెంత ఖర్చు పెట్టి మమ్మల్ని నిలబెట్టి, నడిపించే ప్రయత్నం చేసినా... సడన్‌గా ఏదోకరోజు బకెట్‌ని తన్నేసే వయసు మాది. మీరు మాకు వైద్యం చేయించగలరుగాని మా యుక్తవయసుని వెనక్కి తీసుకురాలేరు గదా" అన్నాడు.

"అయితే ఏమిటంటారు"

"చిరాకు పడకండయ్యా! నేను చెప్పేది జాగ్రత్తగా వినండి. మీరు ఇక్కడ హాస్పిటల్ చుట్టూ తిరుగుతూ మీ కిరాణా కొట్టు తెరవడం మానేశారు. ఇదే అదనుగా మిగతా కొట్లు పుంజుకొని మీ లాభాలను లాగేస్తున్నాయి. అంచేత నేను చెప్పేది ఏమిటంటే మీరు ఆపరేషన్‌కి ఎనభై వేలు కాదు కదా ఎనిమిది రూపాయలు కూడా కట్టవద్దు.

"మీ నాన్నని డిశ్చార్చి చేయించి ఇంటికి తీసుకుపొండి. మీరు కొట్టు తెరిస్తే మీ నాన్న ఊపిరి కొట్టుకుంటుంది. మీ నాన్నగారు బతికి ఉన్నంతకాలం మన వీధిలో డాక్టర్ సుధాకర్ చేత ట్రీట్‌మెంట్ ఇప్పిద్దాం. బంధువులు ఆక్షేపిస్తారని, ఎవరో ఏదో అంటారనీ భయపడకండి. మీ ఒళ్ళు, ఇల్లు, డబ్బు గుల్ల చేసుకోకండి. నేనే మీ నాన్న స్థానంలో ఉంటే ఎలాగోలా నోరు పెగల్చి నాకు ఏ వైద్యం వద్దు వెంటనే ఇంటికి తీసుకుపొమ్మని ఆర్డరు జారీ చేస్తాను. నాపై గౌరవం మీకుంటే నేను చెప్పినట్టు చేయండి. నా అవసరం ఏదైనా ఉంటే పిలవండి వస్తాను" అని వాళ్ల ముఖాల్లోకి చూసే ధైర్యం లేక పరుగున బయటకు వచ్చాడు భానుమూర్తి.

ఆ పిల్లలకి ఎలా చెప్పగలడు ఈ నక్షత్ర ఆస్పత్రుల భాగోతాలు? ఇవి పేషంట్లకి నిజంగానే పగటి పూటే నక్షత్రాలు చూపిస్తున్నాయి. ఏం చేస్తాం. వ్యాపార శక్తులు రాజ్యమేలుతున్నాయి. వ్యాపారం అన్ని రంగాల్లోను ప్రవేశించినట్లు వైద్య రంగంలో కూడా కేన్సర్‌లా పాకేసింది.ఎవరైనా పొరపాటున రోగం అనే అనుమానంతో వెళితే నించున్న పాళాన నిలువు దోపిడీ చేయబడుతున్న వైనం.

వ్యాపార శక్తులు మన జీవన వ్యవహారాలన్నింటినీ నిరంకుశంగా శాసించే పాలించే స్థితిలో ఉన్నాయి. మన గతి ఇంతే. అవును, ఈ జీవితం భయంకరమై భయపెడ్తోంది.

ఈ జీవితం దుస్సహమై వేధిస్తోంది.
ఈ జీవితం దుష్టమై బాధిస్తోంది.
ఈ జీవితం దుఃఖభూయిష్టం.

ఈ నాటకం చివరి అంకం అంతం స్పష్టం. మరణమే నాకు అత్యంత, అపరిమిత ఇష్టం.

ఎంత శీఘ్రం, ఎంత వేగం ఈ నికృష్ట బతుకు శ్వాస ఆగేది.

ఆటోలో అంతిమయాత్ర. ఎందుకో అంత స్పీడు. ఎదురుగా లోక భీర మృత్యుశకటం లారీ. దానికి అడ్డూ ఆపు ఏదీ!

అదిగో – వెంట్రుక వాసిలో, రవంతలో, ఒక కనురెప్పపాటులో, ఒక ఏమరుపాటులో ఒక నిర్లక్ష్యంలో – చండప్రచండార్భాటంతో నింగి నేల కూలినట్లు, నేల బద్దలయినట్లు, పర్వతాలు పేలినట్లు భానుమూర్తి దద్దరిల్లిపోయి "సరోజా" అని పెనుకేక.

ఆటో లారీ ఢీ.

అక్కడంతా భయానకం – రక్తమయం.

❁ ❁ ❁

భానుమూర్తికి తెలివి వచ్చేటప్పటికి నక్షత్ర హాస్పిటల్‌లో ఉన్నాడు. ఆ రోజే రామయ్య డిశ్చార్జి అవుతున్నాడు. ఆపరేషనైంది. అతని ఆరోగ్యం బాగుంది. భానుమూర్తికి యాక్సిడెంట్ అయి పది రోజులైంది. ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నాడు.

స్ట్రెచ్చర్‌పై భానుమూర్తిని ఆపరేషన్ థియేటర్‌కి తీసుకువెళుతున్నారు. మేజర్ ఆపరేషన్. అది విజయవంతమయితే తప్పా భానుమూర్తి పరిస్థితి చెప్పలేం అన్నారు డాక్టర్లు.

భానుమూర్తి ఒంటరి వాడు కాదు. చుట్టూ స్నేహితులు. బంధువులు ఎందరో ఉన్నారు. సుబ్బారావు ధైర్యం చెబుతున్నాడు. రామయ్య కొడుకులు అతని నుదుట విభూది పెట్టేరు. ఆపరేషన్ సక్సెస్ కావాలి. ఇంకా విశేషం ఏమిటంటే అతని చెంత కొడుకు చైతన్య ఉన్నాడు! కళ్ళనీళ్ళతో తండ్రి చేయిని తను వదలడం లేదు.

కొడుకు పక్కనే గుజరాతీ కోడలు. ఆమె ఒడిలో ముద్దులొలుకుతూ బొద్దుగా మనవడు. ఇదంతా ఒక అద్భుతం. తీయని కలల ప్రపంచం. ఆపరేషన్ థియేటర్ లోపలికి వీళ్ళనందరినీ విడిచి భానుమూర్తి ఒంటరిగా.. అంతలో స్ట్రెచ్చర్‌పై భానుమూర్తి ఒక్కసారిగా లేచికూర్చున్నాడు.

'నాకు ఆపరేషన్ వద్దు. మీరెవరూ వద్దు. వద్దు. నాకు మరణం కావాలి. చచ్చిపోనివ్వండి. లెట్‌మి డై' అన్లేదు. భానుమూర్తి బాధ అది కాదు.

పక్కనే ఉన్న డాక్టర్‌తో – "నన్ను బతికించండి డాక్టర్ బతికించండి. నాకు బతకాలని ఉంది. ఎంత డబ్బు ఖర్చయినా ఫర్వాలేదు. నన్ను బతికించండి. ఐ వాంట్ టూ లివ్. లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్. నన్ను బతికించండి డాక్టర్" అని అరుస్తూ, ఏడుస్తూ డాక్టర్‌ని వేడుకుంటుండగా... ఆపరేషన్ థియేటర్ తలుపులు మూసుకున్నాయి. ❁